# వైభవంగా జగన్నాథుని బహుదా యాత్ర



ఉక్కులో జగన్నాథునికి పూజలు చేస్తున్న డైరెక్టర్ మొహంతి దంపతులు



85వ వార్డు ఇంద్రద్యుమ్న హాల్లో బుద్ధావతారంలో దర్శనమిచ్చిన జగన్నాథస్వామి

**ఉక్కునగరం:** ఉక్కునగరంలో జగన్నాథుని బహుదా యాత్ర (తిరుగు యాత్ర) బుధవారం వైభవంగా జరిగింది. తొమ్మిది రోజుల క్రితం రథయాత్రలో గుండిచా మందిరానికి చేరుకున్న జగన్నాథుడు సుభద్ర, బలభద్ర సమేతంగా పూజలందుకున్నారు. తిరిగి జగన్నాథుని ఆలయానికి చేరుకునేందుకు ముందుగా గుండిచ ఆలయంలో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) డి.కె.మొహంతి దంపతులు జగన్నాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుభద్ర, భలబద్ర సమేత జగన్నాథుని ఉత్సవ విగ్రహాలను రథంపైకి తరలించారు. ఈ సందర్భంగా మొహంతి సంప్రదాయ దుస్తుల్లో బంగారు చీపురుతో రథాన్ని శుభ్రం చేశారు. అనంతరం పెద్ద ఎత్తున హాజరైన భక్తుల నామోచ్చరణల మధ్య రథాన్ని ఉక్కునగరంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఉత్కళ్ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

### బుద్ధావతారంలో జగన్నాథుడు

**అగనంపూడి:** జగన్నాథ స్వామి రథోత్సవాలు 85వ వార్డు జగన్నాథస్వామి ఇంద్రద్యుమ్న హాలు వద్ద కనులపండువగా జరుగుతున్నాయి. దశావతారాల్లో భాగంగా దశమిని పురస్కరించుకుని జగన్నాథ స్వామి బుధవారం బుద్ధావతారంలో దర్శనమిచ్చారు. సుభద్ర, బలభద్ర సహిత జగన్నాథుడికి ఆలయ ప్రధాన అర్చకులు గురు సంతోష్ స్వామి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం ఎస్ఎల్‌పీ రావు బృందం భజన గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో గురుమోహన్, గెద్దాడ సత్యవతి, దేవరాజు, శ్రీనుబాబు, సన్యాసమ్మ, త్రినాథ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### నేడు తిరుగు యాత్ర

రథయాత్ర మహోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం తిరుగు యాత్ర చేపట్టనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ జెర్రిపోతుల సోమునాయుడు తెలిపారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పూజ చేసిన తరువాత తిరుగుయాత్ర ప్రారంభం అవుతుందన్నారు.

# 'కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాలి'



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

**కూర్మన్నపాలెం:** స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 867వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని, లేనిపక్షంలో బీజేపీకి వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవన్నారు. భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ ప్రధాని మోదీ తన నిరంకుశత్వ పాలనతో అన్యాయంగా విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. దేశంలో సంపద సృష్టించలేని బీజేపీ ప్రభుత్వానికి అమ్మే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ప్లాంటును పూర్తి స్థాయి ఉత్పత్తి దిశగా నడపవలసిన యాజమాన్యం కావాలనే నష్టాల వైపు నెట్టే ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఇకనైనా కుటిల రాజకీయాలు ఆపి స్టీల్‌ప్లాంట్‌ను పూర్తిస్థాయి ఉత్పత్తి దిశగా నడపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

# విజ్ఞాన్‌లో టెక్స్‌టైల్ ఇంజినీరింగ్ కోర్స్

## బ్రాండెక్స్‌తో ఎంవోయూ



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఇరు సంస్థల ప్రతినిధులు

**అగనంపూడి:** ప్రముఖ అపెరల్ పార్కు బ్రాండెక్స్‌తో దువ్వాడ విజ్ఞాన్ యాజమాన్యం పరస్పర ఒప్పందం చేసుకుంది. కళాశాలలో ఈ ఏడాది నుంచి 8 సెమిస్టర్ల టెక్స్‌టైల్స్ ఇంజినీరింగ్ కోర్స్ ప్రవేశపెట్టడం జరుగుతుందని కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు తెలిపారు. ఈ సందర్భంగా బ్రాండెక్స్ యాజమాన్య ప్రతినిధులు వీరబాహు, షహజాది షేక్ మాట్లాడుతూ బ్రాండెక్స్ ఇండియాతో పాటు శ్రీలంక, బంగ్లాదేశ్, హయాతి, కాంబోడియా వంటి దేశాల్లో అపెరల్ రంగంలో ప్రముఖ పాత్ర పోషిస్తోందన్నారు. అపెరల్ సంస్థతో విజ్ఞాన్ యాజమాన్యం ఒప్పందం చేసుకోవడం వల్ల విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, సీఈవో శ్రీకాంత్, వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# దురలవాట్లకు దూరంగా ఉండాలి

## జూనియర్ సివిల్ జడ్జి ప్రేమలత



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న న్యాయమూర్తి ప్రేమలత

**గాజువాక:** మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు అందరూ దూరంగా ఉండాలని గాజువాక జూనియర్ సివిల్ జడ్జి వై.ప్రేమలత అన్నారు. మాదక ద్రవ్యాల నిరోధంపై నషా ముక్త్ భారత్ అభియాన్ (ఎన్ఎంబీఏ) ఆధ్వర్యంలో గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. డ్రగ్స్, మత్తు పదార్థాలకు అలవాటు పడితే బంగారు భవిష్యత్ నాశనమవుతుందన్నారు. సరదా కోసం, స్నేహితుల ప్రోద్బలం ప్రభావంతో ప్రారంభించిన చెడు అలవాట్లు పిల్లల మెడకు చుట్టుకుంటాయన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే జ్ఞాపకశక్తి క్షీణించడంతోపాటు ఏకాగ్రత లోపిస్తుందని, పక్షవాతం రావడం వంటి దుష్పరిణామాలు తలెత్తి జీవితమే నాశనమయ్యే ప్రమాదం ఉంటుందని అన్నారు. అందువల్ల పిల్లలు వాటికి దూరంగా ఉండాలన్నారు. గాజువాక ఎస్ఐ మన్మథరావు మాట్లాడుతూ డ్రగ్స్‌ను ఉపయోగించే వారు కఠినమైన శిక్షలకు కూడా గురవుతారన్నారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని కె.విజయ ప్రశాంతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ జె.మాధవి, డాక్టర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## మహిళా పోలీసుల అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా పోలీసులు

**అగనంపూడి:** మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై జీవీఎంసీ 79, 85 వార్డుల్లోని సచివాలయ మహిళా పోలీసులు బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులతో నినాదాలు చేస్తూ మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు.కార్యక్రమంలో దువ్వాడ పోలీసులు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అడుగడుగునా నీరాజనం



ఎమ్మెల్యే నాగిరెడ్డికి హారతిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

**పెదగంట్యాడ:** జీవీఎంసీ 74వ వార్డు దయాల్‌నగర్ క్వారీ రోడ్డు వద్ద బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి మహిళలు అడుగడుగునా హారతులు పట్టి స్వాగతించారు. కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డితో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి, లబ్ధిదారులతో మాట్లాడారు. నాలుగేళ్లలో వారికి చేకూరిన లబ్ధి గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పారదర్శక పాలన అందిస్తూ అందరికీ లబ్ధి చేకూరుస్తున్నారన్నారు. గడపకు గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, మార్టుపూడి పరదేశి, యువశ్రీ, రోజారాణి, ఎన్‌వై నాయుడు, ఎస్.రాజారావు, శీకు రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తరాఖండ్ సీఎంకు చాతుర్మాస దీక్షకు ఆహ్వానం

**సింహాచలం:** విశాఖ శ్రీశారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి బుధవారం ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ దామితో భేటీ అయ్యారు. వచ్చేనెల 3న రుషికేష్‌లో ప్రారంభించనున్న చాతుర్మాస దీక్షపై చర్చించారు. విశాఖ శ్రీశారదాపీఠం రిషికేష్ ఆశ్రమాన్ని సందర్శించాలని కోరుతూ ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ దామి మాట్లాడుతూ ప్రభుత్వం తరపున దీక్షకు ఎలాంటి సహకారమైనా అందిస్తామని స్వాత్మానందేంద్ర స్వామికి హామీ ఇచ్చారు.

# రేపటి నుంచి మసీదుల సందర్శన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దేవన్‌రెడ్డి

**గాజువాక:** వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ సెల్ ప్రతినిధులు ఈ నెల 30 నుంచి గాజువాక నియోజకవర్గంలో గల అన్ని మసీదులను సందర్శించనున్నట్టు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కార్యక్రమం పోస్టర్‌ను ఆయన బుధవారం ఆవిష్కరించారు. మసీదుల సందర్శన కోసం ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు ఆయా మసీదుల్లోని సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తారని తెలిపారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కె.వి.బాబా మాట్లాడుతూ ప్రతి ఒక్కరి హృదయంలోను వైఎస్సార్ ఉన్నారని, తామంతా జగన్ వైపు ఉన్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.డి.గౌస్, నాయకులు ఇర్ఫాన్, మోతి, సర్దార్, చోటూ, అన్వర్ షహీద్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పల్లా పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

# నేడు ప్రసన్న వేంకటేశ్వరాలయంలో అన్నకూటోత్సవం

**అక్కిరెడ్డిపాలెం:** తొలి ఏకాదశిని పురస్కరించుకుని భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న వేంకటేశ్వరాలయంలో గురువారం తిరుప్పావడ సేవ (అన్నకూటోత్సవం) నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.జగన్నాథరావు, చైర్మన్ గండ్రెడ్డి రామునాయుడు తెలిపారు. పరిసర ప్రాంతాల భక్తులు పూజల్లో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించాలని కోరారు.

# రేపు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

**గాజువాక:** చినగంట్యాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని శ్రామికనగర్ ఫీడర్‌కు ఈ నెల 30న నిర్వహణ పనులు చేపట్టనున్నారు. ఈ కారణంగా కుంచుమాంబ కాలనీ, శ్రీనివాసనగర్, ఎర్రగెడ్డ కాలనీ, శ్రామికనగర్, మెహర్‌నగర్, గొంతినవానిపాలెం, ప్రశాంతినగర్, గ్రంథాలయం ఏరియా, సనత్‌నగర్ ప్రాంతాలకు ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటన్నర వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.కె.నాయుడు తెలిపారు.

### కర్ణవానిపాలెం సబ్ స్టేషన్ పరిధిలో..

కర్ణవానిపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని స్వతంత్రనగర్, తుంగ్లాం ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా కృష్ణదేవరాయనగర్, పాత కర్ణవానిపాలెం, స్వతంత్రనగర్, అఫీషియల్ కాలనీ వినాయక ఆలయ ప్రాంతం, వై జంక్షన్, సర్దార్ నెస్ట్ ఏరియా, తుంగ్లాం, చుక్కవానిపాలెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు గమనించాలని కోరారు.

### దిబ్బపాలెం, పాలవలస ఫీడర్ల పరిధిలో..

**పెదగంట్యాడ:** దిబ్బపాలెం 11కేవీ ఫీడర్, పాలవలస 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బి.కె. నాయుడు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా దిబ్బపాలెం ఫీడర్ పరిధిలోని వెంకన్నపాలెం, ఇండస్ట్రియల్ ఏరియా, కొంగపాలెం, సత్యనారాయణపురం, ఉప్పరకాలనీ, గంగవరం, గొడ్డువానిపాలెం, కండిపల్లి వారి వీధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. పాలవలస ఫీడర్ పరిధిలోని మద్దివానిపాలెం, నమ్మిదొడ్డి, ఇస్లాంపేట, దేవాడ, అప్పికొండ, లక్ష్మీనగర్, శ్రీరామ్‌నగర్, మురుభాయ్, పాలవలస, గొల్లపేట, ఈసరపువానిపాలెం, యలమంచిలి దొడ్డి, గిన్నెవానిపాలెం, నక్కదొడ్డి తదితర ప్రాంతాల్లోనూ పైన తెలిపిన సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలియజేశారు.

### గాజువాక ఫీడర్ పరిధిలో..

**అక్కిరెడ్డిపాలెం:** 11 కేవీ గాజువాక ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్–2, ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. రాంనగర్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు.

# ప్లాంట్ అభివృద్ధిలో సీనియర్ ఉద్యోగుల పాత్ర కీలకం



రమణయ్యను సత్కరిస్తున్న స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ అభివృద్ధిలో సీనియర్ ఉద్యోగుల పాత్ర కీలకమని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద యూనియన్ ఎస్సీ, ఎస్టీ నాయకుల ఆధ్వర్యంలో ఈ నెలాఖరున పదవీ విరమణ చేస్తున్న యూనియన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్.వి. రమణయ్యను బుధవారం సత్కరించారు. రాజశేఖర్ మాట్లాడుతూ ప్లాంట్ మొదటి దశలో చేరిన కార్మికులు వందలాదిగా పదవీ విరమణ చేస్తుండటంతో సిబ్బంది కొరత ఏర్పడుతోందన్నారు. యాజమాన్యం వెంటనే ని యామక ప్రక్రియ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నీరుకొండ రామచంద్రరావు, సిహెచ్. సుదర్శనం, కారు రమణ, బి.ఎస్. రాజు, బీఎంకె నాయక్, జి.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

## సంపత్ వినాయకుని హుండీల లెక్కింపు



ఆదాయాన్ని లెక్కిస్తున్న శివజ్యోతి సంఘం సభ్యులు

**సీతమ్మధార:** ఆశీలమెట్టలో కొలువైన సంపత్ వినాయగర్ ఆలయం హుండీలను బుధవారం దేవదాయ శాఖ తనిఖీదారుడు బి.వసంత కుమార్ పర్యవేక్షణలో లెక్కించారు. 25 రోజులకు గాను రూ. 17,03,494, 11 గ్రాముల బంగారం, 122 గ్రాముల వెండి, 61 యూఎస్ఏ డాలర్లు, 10 కెనడియన్ డాలర్లు, 1002 ఖతార్ రియాల్, 20 మలేషియా రింగిట్, 30 యెన్‌లు వచ్చినట్లు ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.చోళన్ తెలిపారు. శివజ్యోతి, శ్రీ వేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు హుండీల లెక్కింపు చేపట్టారు. ఆలయ సిబ్బంది గోవింద్ రెడ్డి, ప్రసాద్, ఈ.అప్పలరాజు, బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు



గంజిపేటలో ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

**అగనంపూడి:** ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదేనని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 85వ వార్డు గెంజిపేటలో ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి, లబ్ధిదారులను కలుసుకున్నారు. సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం ప్రజలతో మాట్లాడుతూ అధికారం కోసం టీడీపీ, జనసేన పార్టీలు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నాయన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబుకు బుద్ధి చెప్పినా సిగ్గు లేకుండా.. జనసేన పార్టీని వెనకేసుకుని ఎన్నికలకు రావడం సిగ్గు చేటన్నారు. 14 ఏళ్లు సీఎంగా పాలన సాగించి, రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి సాధించకుండా ఏ విధంగా వస్తారని ప్రశ్నించారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న జగనన్నకు ప్రజలు అండగా నిలిచి రానున్న ఎన్నికల్లో సీఎంగా గెలిపించుకోవడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, 79 వార్డు ఇన్‌చార్జ్ అప్పికొండ మహాలక్ష్మినాయుడు, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నదియా, పార్టీ సీనియర్ నాయకులు సుందరపు అప్పారావు, ప్రకాష్, గంజి వెంకటలక్ష్మి, గంజి సురేష్, కర్రి నర్సింగరావు, ఆశాజ్యోతి, సుందరపు శ్రీనివాసరావు, గొన్న హేమచంద్ర, జి.హరీష్, పూర్ణానందశర్మ, అధికారులు, వలంటీర్లు, వార్డు ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఉపాధి కల్పనకు ఉచిత శిక్షణ

**మురళీనగర్:** నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో భాగంగా సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైమ్ అండ్ షిప్‌బిల్డింగ్ (సెమ్స్) లో వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెమ్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ గోపీకృష్ణ శివం ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య పథకంలో భాగంగా 18–26 సంవత్సరాల యువతకు ఉచిత వసతీ సౌకర్యాలతో ఉపాధి శిక్షణ ఇస్తామన్నారు. పదో తరగతి, ఐటీఐలో వెల్డర్, ఫిట్టర్, టర్నర్, సీవోపీఏ, మెషినిస్ట్, మెకానికల్ డిప్లమో, డిగ్రీ ఉత్తీర్ణులైనవారికి వెల్డింగ్ టెక్నాలజీ, లాజిస్టిక్స్ సెక్టార్‌లోని వేర్‌హౌస్ సూపర్‌వైజర్ కోర్సులు, సీఎన్‌సీ మెషీన్ ఆపరేటర్ కోర్సుల్లో మూడు నెలలపాటు ఉచితంగా భోజన వసతి కల్పిస్తూ శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం ఉపాధి కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి గల వారు సింధియా కూడలిలోని సెమ్స్ కార్యాలయానికి నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 77948 40934, 85006 87750 లేదా 0891–2704010 ఫోన్ నంబర్లలో జూలై 5వ తేదీలోగా సంప్రదించాలన్నారు. శిక్షణ తరగతులు జూలై 10 తేదీ నుంచి ప్రారంభమవుతాయని చెప్పారు.

## క్లుప్తంగా

### నేడు అందుబాటులో విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలు

**గాజువాక:** బక్రీద్ రోజైన గురువారం కూడా విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలు తెరిచే ఉంటాయని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు తెలిపారు. గాజువాక ఈఆర్వో కార్యాలయం సహా పెదగంట్యాడ, కంచరపాలెం, మాధవధార వుడా కాలనీ సమీపంలోని ఎన్ఎస్‌టీఎల్ సెక్షన్ ఆఫీసులోని ఆర్‌ఐవీ కలెక్షన్ కేంద్రాలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తెరిచే ఉంటాయని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గుర్తించి తమ బిల్లులను చెల్లించాలని కోరారు.

### వ్యాధులపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు డెంగ్యూ, మలేరియా వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న మలేరియా సిబ్బంది

**అక్కిరెడ్డిపాలెం:** డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని గాజువాక ఆరోగ్యశాఖ హెచ్ఈవో మురళీధర్ విద్యార్థులకు సూచించారు. జీవీఎంసీ 68వ వార్డు మింది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డెంగ్యూ, మలేరియా జ్వరాలపై గాజువాక అర్బన్, యాంటీ మలేరియా సిబ్బంది బుధవారం అవగాహన కల్పించారు. వ్యాధుల నివారణ, తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. వీటిపై రాత పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పి.వి.ఎస్.ఎస్.ఎస్.ఆంజనేయ, ఉపాధ్యాయిని భారతి, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ మేడిద మురళీకృష్ణ, కృష్ణారావు, కొత్తర అప్పలరాజు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### శిశుగృహ, ఐసీడీఎస్ కార్యాలయాల సందర్శన

**మర్రిపాలెం:** ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద ఉన్న శిశుగృహ, ఐసీడీఎస్ కార్యాలయాన్ని బుధవారం ఆర్‌జేడీ చిన్మయిదేవి, పీడీ వెంకటేశ్వరి సందర్శించారు. శిశుగృహలో పలు దస్త్రాలను పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. ఐసీడీఎస్ కార్యాలయంలో ఇటీవలే నూతనంగా ఏర్పడిన సెక్టార్ విధివిధానాలను వారు అడిగి తెలుసుకున్నారు. అక్కడ నిర్వహించిన ప్రాజెక్ట్ సమావేశంలో అంగన్‌వాడీ సిబ్బంది పలు సూచనలిచ్చారు. అధికారుల వెంట అడిషనల్ సీడీపీవో శ్రీలత, సూపర్‌వైజర్లు కుమారి, వెనిష తదితరులు ఉన్నారు.

### రేపు మెగా జాబ్‌మేళా

**కంచరపాలెం:** జిల్లా ఉపాధి కార్యా లయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో క్లరికల్, టెక్నికల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 30న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారులు సిహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్)తెలిపారు. డబ్ల్యూఎన్ఎస్ గ్లోబల్ సర్వీసెస్, ముత్తూట్ ఫైనాన్స్ కార్ప్, హెటిరో డ్రగ్స్, నవత రోడ్డు ట్రాన్స్‌పోర్ట్, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, దక్కన్ ఫైన్ కెమికల్స్, పేటీఎం, సువర్ణభూమి డెవలపర్స్, అపోలో ఫార్మసీ ప్రైవేట్ లిమిటెడ్ తదితర సంస్థల్లో 375 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. ప్రాసెస్ అసోసియేట్, కాల్ అసిస్టెంట్, ఆపరేటర్, కస్టమర్ ప్రతినిధి, కెమిస్ట్, క్యాషియర్, జూనియర్ క్యాడ్ ఇంజినీర్, వేర్‌హౌస్ అసోసియేట్స్, జీఐఎస్ ఇంజినీర్ క్యాడ్, టెలీకాలింగ్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కేర్ టేకర్స్, సెక్యూరిటీ గార్డ్స్, బ్రాంచ్ గోడౌన్ ఇన్‌చార్జి, కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలను భర్తీ చేస్తారు. ఎస్ఎస్‌సీ, ఏదైనా డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్, ఐటీఐ, డిప్లమో, బీటెక్, ఎంబీఏలో ఉత్తీర్ణత సాధించి 18–27 ఏళ్ల వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులు. ఆసక్తి గల అభ్యర్థులు https:// www. ncs. gov.in/ లో తమ పేర్లు నమోదు చేసుకోవాలి. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి జరిగే జాబ్‌మేళాకు హాజరు కావాలని వారు కోరారు.

### నేటి నుంచి ఆలయ వార్షిక వేడుకలు

**కూర్మన్నపాలెం:** జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి సిద్ధార్థనగర్‌లోని వరసిద్ధి వినాయక, సుబ్రహ్మణ్యేశ్వర, అయ్యప్ప స్వామి ఆలయ 21వ వార్షిక వేడుకలు గురు, శుక్రవారాల్లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.